క్లుప్తంగా

నేడు స్థానిక ఎన్నికల నిర్వహణపై సమావేశం

వీపనగండ్ల: రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం॥లకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలకు ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్ల వివరాలు, ఇంతకు పూర్వం ప్రకటించిన ఓటరు జాబితా తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. కావున మండలంలోని వివిధ పార్టీల రాజకీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మండల యాదవ సంఘం కమిటీ ఎన్నిక



వనపర్తి రూరల్: పెబ్బేరులో ఆదివారం శ్రీకృష్ణ యాదవ సంఘం సమావేశం నిర్వహించి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీవీ భగవంత్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా జుర్రు గోవింద్‌యాదవ్, గుడిసె మహేష్ యాదవ్, పెద్ద కథలయ్య యాదవ్, చింతల రామకృష్ణయాదవ్, జుర్రు వెంకటేష్ యాదవ్, కోశాధికారి మేకల ఎల్లస్వామిలను ఎన్నుకున్నారు. అదేవిధంగా సహాయ కార్యదర్శులు తొండ సురేష్‌యాదవ్, మేకల వెంకటస్వామి యాదవ్, తొండగట్టు యాదవ్, కురువ మల్లయ్య, ప్రచార కార్యదర్శిగా తొండ రమేష్, కార్యదర్శులుగా బత్తుల రాజు, అరికి చౌడయ్య, చింతలసురేష్, అర్కి జంపన్న, మేకల రఘువీర్, తొండ బీరయ్య, చింతల రాజు, రమేష్ అనంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మండల గౌడ సంఘం నూతన కమిటీ



పాన్‌గల్: మండలగౌడ సంఘం నూతన కమిటీని మండల కేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడసంఘం నాయకులు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా రాజేష్‌గౌడ్ (రేమద్దుల), ప్రధాన కార్యదర్శిగా యుగంధర్‌గౌడ్ (దావాజీపల్లి), కోశాధికారిగా వెంకటేష్‌గౌడ్ (గోప్లాపూర్) ఉపాధ్యక్షులుగా రమేష్‌గౌడ్ (పాన్‌గల్), రాజయ్యగౌడ్ (జమ్మాపూర్) సహాయ కార్యదర్శిగా ఆశోక్‌గౌడ్ (చింతకుంట) ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా జీవన్‌గౌడ్, ఆశోక్‌గౌడ్, వెంకయ్యగౌడ్, వినోద్‌గౌడ్, అర్జున్‌గౌడ్, రమేష్‌గౌడ్, నాగరాజుగౌడ్‌తో పాటు గౌరవ అధ్యక్షులుగా సురేందర్‌గౌడ్, గౌరవ సలహాదారుడిగా గంగాధర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గౌడ్‌ల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



వనపర్తి రూరల్: మండలంలోని కీర్యాతండాలోని పాఠశాలకు మలుపు దగ్గర ప్రధాన రహదారిపై కల్వర్టు కూలడంతో రంధ్రం పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో పిల్లలు, వృద్ధులు ఆదమరిచి కల్వర్టు వద్ద పడిపోయి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చంద్రగ్రహణం వేళా.. సామూహిక భోజనాలు



అమరచింత: మూఢ నమ్మకాలతో సమాజంను నెట్టేస్తున్నారని సైన్స్‌తోనే మానవుడి జీవితం ముడిపడిఉందని నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో పట్టణంలో హైస్కూల్ ఆవరణలో ఆదివారం సామూహిక భోజనాలు నిర్వహించారు. గ్రహణం సమయంలో భోజనం చేయరాదని అది విషంతో సమానమని, మూఢాచారాలను ప్రజలపై రుద్దడం జరిగిందే తప్పా అలాంటిది ఏమీ ఉండదన్నారు. కార్యక్రమంలో విజయరాములు, రాజన్న, అజయ్, రాజు, రాఘవేంద్ర, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సమస్యల రైల్వేస్టేషన్



వృథాగా ఉన్న మరుగుదొడ్లు

- వనపర్తిరోడ్ రైల్వేస్టేషన్‌లో వసతుల కరవు
- ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు



నీటి సరఫరా లేని కుళాయి

మదనాపురం: వనపర్తి జిల్లా ప్రజలకు రైల్ ప్రయాణానికి ముఖ్యమైన కేంద్రంగా ఉన్న వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్ మౌలిక సదుపాయాల కొరతతో సమస్యల గుట్టగా మారింది. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచే ప్రయాణం చేస్తున్నారు. అయినప్పటికీ రైల్వేస్టేషన్‌లో తాగేందుకు మంచినీరు లేకపోవడం, రెండో ప్లాట్‌ఫారం పై షెడ్డు లేకపోవడం, మరికొన్ని ప్రాథమిక సదుపాయాల లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎండలో నిల్చోవాల్సిందే..

రెండో ప్లాట్‌ఫారంపై షెడ్డు లేకపోవడం వల్ల రైలు వచ్చే వరకు ప్రయాణికులు ఎండలో నిలబడి వేచి ఉండాల్సిందే. వృద్ధులు, పిల్లలు, గర్భిణులు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొన్ని కులాయిలోకి నీరు రావడం లేదు. తాగునీరు అందక ప్రయాణికులు దగ్గర్లో ఉండే హోటళ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎందుకింత నిర్లక్ష్యం..?

వనపర్తి రోడ్ స్టేషన్, జిల్లా స్థాయిలో ఉన్న ఏకైక ప్రధాన రైల్వేస్టేషన్. అయినప్పటికీ అభివృద్ధిపై రైల్వేశాఖ మౌనం వహించడమే అర్థం కాని వ్యవహారంగా మారింది. ప్రజల డిమాండ్ మేరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు చెన్నై ఎగ్మోర్, బెంగళూరు, హైదరాబాద్ వంటివి నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికే అనేకసార్లు సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎలాంటి దిద్దుబాట్లు చోటు చేసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇది జిల్లా కేంద్రానికి సమీపంగా ఉన్న స్టేషన్ అయినా కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేరా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి

ఈ సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి రైల్వేశాఖను ఒత్తిడి తీసుకురావల్సి అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం

మా స్టేషన్లో మౌలిక సదుపాయాలపై ఉన్నత అధికారులకు వివరించాం. నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాం. ప్రస్తుతం ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలికంగా అందుబాటులో ఉన్న మరుగుదొడ్ల తాళాలను అవసరమున్నవారికి ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా తాళాలు అడిగితే, వాటిని రిజిస్టర్‌లో నమోదుచేసి, ప్రయాణికులకు అందిస్తున్నాం. ఇది పూర్తిగా ప్రయాణికుల సౌకర్యం కోసమే చేపడుతున్న వ్యవస్థ.

విష్ణు, స్టేషన్‌మాస్టర్

ఎండలో నిలబడడం కష్టంగా ఉంది



ప్రతిసారీ హైదరాబాద్ వెళ్తుంటాం. రెండో ప్లాట్‌ఫారంపై రైలు ఆగుతుంది. షెడ్డు లేకపోవడం వల్ల ఎండలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. వృద్ధులకి ఇది పెద్ద కష్టంగా మారింది. కనీసం షెడ్డు నిర్మించాలని కోరుతున్నాం.

– దామోదర్, సత్యహళ్లి, కొత్తకోట మండలం

నీటికి పరుగులు తీయాల్సిందే..



స్టేషన్‌లో చాలా చోట్ల నీటి కులాయిలు పని చేయడం లేదు. తాగునీటి కొరత ఎంతో మంది ప్రయాణికులను ఇబ్బందిలో పెడుతోంది. ఇదొక ప్రాథమిక అవసరం. అలాంటిది లేకపోవడం నిర్లక్ష్యమే.

– భీమన్ననాయుడు

ఈ స్థితి ఏమిటీ..



వనపర్తి జిల్లాలో పెద్దస్టేషన్. అయినా ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. షెడ్డులేదు సరిగా కుర్చీలు కూడా లేవు. దీన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రైల్వేశాఖదే. ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించాలి. మౌలిక సదుపాయాలపై అధికారులకు విన్నవించాం.

– బాలరాజు మదనాపురం

తెలంగాణ సాయుధ పోరాటం మరువలేని ఘట్టం



అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో ఒక మరిచిపోలేని ఘట్టంగా పేర్కొనవచ్చునని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధపోరాట అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో భూమి, భుక్తి, విముక్తి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. వారి పోరాట స్ఫూర్తితో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాదన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతం చేస్తూ పేదప్రజలకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బాబునాయక్, తండా మాజీసర్పంచ్ శాంతమ్మ, రవినాయక్, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



కొత్తకోటలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న నాయకులు

కొత్తకోట: కొత్తకోటలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 10 మందికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం వేర్వేరుగా స్థానిక రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ గుంత మౌనిక, మదనాపురం మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ నేర్పించి విద్యార్థులను భావి, భారత పౌరులుగా తీర్చిదిద్దే గురువుదైవంతో సమానమన్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించి ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు దేవన్న, శేఖర్‌గౌడ్, సురేష్ కుమార్‌సాగర్, హుస్సేన్ మాట్లాడుతూ..ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికై నందుకు తమకు సంతోషంతో పాటు విద్యార్థుల పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, శేఖర్‌రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, సుభాష్, అయ్యన్న, పెంటన్న, వినోద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి విద్యావిభాగం: గురుపూజ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అఖిలపక్ష ఐక్యవేదిక ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ మీడియం జీహెచ్‌ఎం పి.గాయత్రి, జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు గుంట్ల గురురాజు, స్కూల్ అసిస్టెంట్ పలుస శ్రీనివాస్‌గౌడ్‌లను ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్‌యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రాజనగరం రామస్వామి, నాగరాజు, రమేష్, జింగిడిపురం రవి, విజేత రాములు పాల్గొన్నారు. అలాగే జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెల్లం, సోయం వ్యాఖ్యలు సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న లంబాడీ నాయకులు

వనపర్తి టౌన్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ వ్యతిరేకమని, ఈ వ్యాఖ్యలతో ఏం సాధించలేరని మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ బస్తీరాంనాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడి గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు డిమాండ్ చేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. వారిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయరాంనాయక్, సూర్యనాయక్, గోపాల్‌నాయక్, సక్రూ నాయక్, కళాకారులు గోపినాయక్, దశరథంనాయక్, రాములునాయక్, లక్ష్మణ్‌నాయక్, శివుడునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన చెట్లకొమ్మలు



పాన్‌గల్: వనపర్తి – కొల్లాపూర్ వయా పాన్‌గల్ మీదుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కమ్మేసిన చెట్లకొమ్మలను తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చెట్లకు ఉన్న కొమ్మలు రోడ్డును కమ్మేయడంతో పాటు పిచ్చిమొక్కల పొదలు కూడా నిండిపోయి వాహనాలు దగ్గరికి వచ్చే తెలియక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలు కాకుండా తగుచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య ప్రమాదకరంగా నీటిగుంత



పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నీటి నిల్వ గుంత ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ప్రాథమిక పాఠశాల సమీపంలోని మురుగు నీరు ఇళ్ల మధ్య ఉన్న గుంతలో చేరుతున్నాయి. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవించే అవకాశం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. గుంతతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ లేకుండా చూస్తూ ఇబ్బందులు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గుంతలమయంగా రహదారి..

వనపర్తి రూరల్: పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో రెండేళ్ల క్రితం ప్రారంభంమైన హై లెవల్ వంతెనలు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో వాహనదారులు వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసిన రోడ్డు వర్షాలకు గుంతలు ఏర్పడి వాహనదారులు రోజు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నామని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాగే ఉంటే ప్రమాదాల బారిన పడతారని, కనుక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి వంతెన పనులు ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు. దీంతో అప్పటివరకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



హామీలు మరిచిన సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు

వనపర్తి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను మరిచారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సీనియర్ నాయకుడు గొర్ల బలరాం విమర్శించారు. పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కర్రెమ్మగుడి ఎదుట ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాటసమితి వీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం కృష్ణయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చినమాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ రూ.6,000లకు వృద్ధ, వితంతువులు, ఒంటరిమహిళలు, గీత, బీడీ కార్మికులతో పాటు మొత్తం చేయూత పెన్షన్‌లను రూ.4వేలు పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాకముందు ఒకలా, గద్దెనెక్కిన తర్వాత మరోలా రంగులు మారుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరుశరాముడు, గొర్ల బాబురావు, బాలస్వామి, లక్ష్మయ్య, గంధం బాలపీరు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డికి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం రూ.29 వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలో అనారోగ్యానికి గురైన పలు కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబునాయుడు, రామన్‌గౌడ్, తిరుపతయ్య, సత్యంరావు పాల్గొన్నారు.

లడ్డు ప్రసాదం పంపిణీ



ఆత్మకూర్: పట్టణంలో బీసీకాలనీలో ప్రతిష్ఠించిన మహాగణపతి లడ్డును రూ.4.80 లక్షలుకు దక్కించుకున్న మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు ఆదివారం లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. 25కేజీల లడ్డు ప్రసాదాన్ని పట్టణంలో అన్ని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీధర్‌గౌడ్‌కు సన్మానం



ఆత్మకూర్: పట్టణంలో మొదటిసారి ఒకేరోజు వినాయకుల నిమజ్జనం విజయవంతంగా చేయడంపై పెద్దమ్మతల్లి ఆలయకమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌గౌడ్‌ను స్థానిక యువకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా క్రమశిక్షణతో డీజే సౌండ్ లేకుండా నిమజ్జనం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటన్న, పీజేపీ ఉద్యోగి మునెప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటపతిరాజు, ట్రాన్స్‌కో ఉద్యోగి కరెంటుపాషా, వెంకటేశ్ ఉన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

అమరచింత: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న మెయిన్‌రోడ్‌లోని ఇనుప విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో అటుగా వెళ్తున్న ట్రాన్స్‌కో అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ స్తంభం ఎప్పుడు కిందపడుతోందనని ప్రజలు గడిపే పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం ముందరితండాలో గ్రామపెద్దలు, యువకులు, మహిళల సమక్షంలో పాఠశాల ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా గ్రామ కమిటీని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. సభలో తీసుకున్న తీర్మానం మేరకు మేఘావత్ దేవుజను కమిటీ అధ్యక్షుడిగా, సభావట్ శ్రీనివాసులును ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా కృష్ణ, కిషన్, రమేష్‌బాబు, సురేష్, రాజు, రాహుల్, భాస్కర్, లాలు, తిరుపతి, శ్రీనివాస్, తారకరాముడు, హనుమంతు, రవి, సచిన్ ఎన్నుకున్నారు.

కోటిలింగేశ్వర ఆలయం మూసివేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామశివారులో కోటిలింగేశ్వరదత్త అంబాభవానీ, కోదండరామస్వామి ఆలయం, భక్తమార్కెండేయ స్వామి ఆలయాలు ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి చంద్రగ్రహణం ఉండడంతో మూసివేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మకూర్: ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో ఆదివారం పట్టణంలో మండలంలోని ఆలయాలన్నీ మూసివేశారు. సోమవారం ఉదయం దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఆత్మకూర్: శ్రీదేవీ శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మండలంలోని ఆరేపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్తులు వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విండోఅధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనసూయమ్మ, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, యుగేంధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏటికాడిలక్ష్మణ్, గోవింద్‌గౌడ్, ప్రవీణ్, వేణు, నారాయణ, గోవర్ధన్, దేవేంద్రం తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఖిల్లాఘనపురం: సంచార విముక్త జాతుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జి ఎనుముల చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో విముక్త దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విముక్త దినోత్సవా న్ని అధికారికంగా నిర్వహించడం సంతోషించదగినదన్నారు. నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారన్నారు.అశోక్‌కుమార్,పొన్నాలకుమార్, మండల అధ్యక్షుడు యాదయ్య, శ్రీరాములు, అంజనేయులు, రాంచంద్రి, రామకృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

ఇవి రేషన్ బియ్యమే..

అమరచింత: పౌరసరఫరాల శాఖ ద్వార తెల్లరేషన్ కార్డుదారులకు అందిస్తున్న సబ్సిడీ బియ్యానికి పురుగులు పట్టాయి. సంచులకు పురుగులు పట్టి తెట్టలు పెట్టాయి. వీటిని రేషన్ డీలర్లు కార్డు దారులకు అందిస్తున్న తరుణంలో వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. పురుగులు పట్టిన బియ్యం ఎలా తినగలమని డీలర్లను నిలదీస్తున్నారు. డీలర్లు మాత్రం అధికారులు ఇచ్చిన కోటా మేరకు బియ్యం ను సరఫరా చేస్తున్నామంటున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని 324 రేషన్ షాపులకు గత మూడు నెలల కిందట ఒకేసారి మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం సరఫరా చేశారు. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేసిన డీలర్లు మిగిలిన బియ్యం సంచులకు తమ వద్దనే ఉంచుకున్నారు. ప్రస్తుతం 4 నెలల తర్వాత రేషన్ దుకాణాల్లో ఉన్న మిగులు స్టాకును కలుపుకొని సెప్టెంబర్ నెల బియ్యం పంపించారు. దీంతో గతంలో ఉన్న బియ్యంకు పట్టిన పురుగులు కొత్తగా వచ్చిన బియ్యం సంచులకు సైతం పాకుతున్నాయి. పాత స్టాక్‌ను రిటర్న్ తీసుకోవడంతో అధికారులు ముందుకు రావడం లేదని డీలర్లు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంలో డీఎస్‌ఓ కాశీవిశ్వనాథ్‌ను వివరణ కోరగా అలాంటి స్టాక్ ఉంటే వెంటనే డీఎంకు వివరించి వెనక్కి పంపాలన్నారు. సివిల్ సప్లై డీఎం జగన్మోహన్‌ను సాక్షి వివరణ కోరగా మూడు నెలల కిందట మిగిలిన స్టాక్‌ను డీలర్లు షాపుల్లో భద్ర పరుచుకోకపోవడం ఏమిటన్నారు. తమ వద్ద ఉన్న గోదాంలలో నెలల తరబడి బియ్యం స్టాకు ఉంటాయన్నారు. పురుగులు పట్టిన బియ్యం ఉంటే వెంటనే తమ స్టాక్ పాయింట్ వారితో డీలర్లు మాట్లాడి అలాంటి బియ్యం వాపస్ చేసి కొత్త బియ్యం తీసుకోవాలని సూచించారు.





అమరచింతలోని డీలర్ కృష్ణయ్య షాపులో తెట్టలు పట్టిన బియ్యంలో పురుగులు